సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
SK1 one NEWS HD
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 67 | పేజిలు : 08, వెల రూ. 2 రూ/ | గురువారం 28-05-2026

# రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం

# పాలనలో దూకుడు చూపిస్తాం

- మహానాడులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మహానాడు వేదికగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- ఎన్నికల నేపథ్యంలో హైబ్రిడ్ పద్ధతిలో మహానాడు నిర్వహణ
- టీడీపీ కార్యకర్తల త్యాగాలను, పోరాటాలను గుర్తు చేసుకున్న సీఎం
- రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే బీజేపీ, జనసేనతో పొత్తు అని స్పష్టీకరణ
- పాలనలో దూకుడుగా, ప్రగతిశీలంగా ముందుకు వెళతామని వెల్లడి



**అమరావతి :**

తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పాలనలో దూకుడుగా, ప్రగతిశీలంగా ముందుకు వెళుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించిన మహానాడులో ఆయన వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. "మీటింగ్ మోడల్ మారిందే తప్ప, మహానాడు విధానం మారలేదు. వాహనాల హోరు తగ్గిందేమో కానీ, కార్యకర్తల్లో జోరు తగ్గలేదు" అంటూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. గత ఐదేళ్లలో పార్టీ ఎదుర్కొన్న కష్టాలను, కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు ఉద్వేగంగా గుర్తుచేసుకున్నారు. దాడులు, హింస, అక్రమ కేసులు, వేధింపులు ఎదురైనా టీడీపీ వెనకడుగు వేయలేదని అన్నారు. "నరహంతకులు పీకలు కోస్తున్నా మన కార్యకర్తలు జెండాను వీడలేదు. - మిగతా 2 లో

# చంద్రబాబును ఎదుర్కోవాలి..

# ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి


- స్థానిక ఎన్నికలపై జగన్ ఫోకస్
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ఏకగ్రీవ ఎన్నిక జరిగితే నియోజకవర్గ ఇంఛార్జి వైఫల్యంగా పరిగణిస్తానని హెచ్చరిక
- ప్రభుత్వ వైఫల్యాలపై 'వెన్నుపోటు రెండేళ్లు' బుక్‌లెట్‌ను ఇంటింటా పంచాలని ఆదేశం
- ఎస్సీలు బలంగా ఉన్నచోట వారినే అభ్యర్థులుగా నిలపాలని సూచన



**అమరావతి :**

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని - మిగతా 2 లో

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తాం



2 లో

- మహానాడులో నారా లోకేశ్ చేసిన 'భారీ ప్రకటన' ఇదే!
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహానాడులో తొలి ప్రసంగం చేసిన నారా లోకేశ్
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని అధికారికంగా ప్రకటన
- చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య

## మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు

2 లో

- పరువు నష్టం నోటీసులు: ఏపీ విద్యాశాఖ హెచ్చరిక
- నిరాధార ఆరోపణలు చేసినవారు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- 15,941 పోస్టుల భర్తీ అత్యంత పారదర్శకంగా జరిగిందన్న ప్రభుత్వం
- పేపర్ లీక్, అక్రమ ఎంపికల ఆరోపణలను ఖండించిన విద్యాశాఖ

## దేశ సరిహద్దులలో అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి



- సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఈ అంశంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అమలు చేయాలన్న అమిత్ షా
- సరిహద్దు జిల్లాల కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం

**ఢిల్లీ :**

దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలన్నారు. రాజస్థాన్‌లోని భారత్-పాక్ సరిహద్దు జిల్లాల్లో భద్రతా పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి - మిగతా 2 లో

## పినరయి విజయన్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత



2 లో

# ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

- ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి
- మోదీతో విజయ్ భేటీ- తమిళనాడుకు మౌలిక, సంక్షేమ పథకాలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి



**ఢిల్లీ :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సమావేశమయ్యారు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత టీవీకే అధినేత ఢిల్లీకి అధికారిక పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన విజయ్ తమిళనాడుకు సంబంధించిన సంక్షేమం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వాలని ప్రధానికి వినతిపత్రాన్ని విజయ్ సమర్పించారు. మేకెదాటు జల వివాదం పరిష్కారానికి కృషి చేయాలని మోదీకి విజయ్ ప్రధానంగా విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. తాగునీటి అవసరాల పేరుతో - మిగతా 2 లో




2 లో

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల బాహాబాహీ

- కిందపడిన ఫిరోజ్‌ఖాన్
- ప్రోటోకాల్ విషయంలో ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ మధ్య ఘర్షణ
- అజారుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన వీహెచ్‌ను నెట్టివేసే యత్నం
- ఇది తమ ఫ్యామిలీ విషయమన్న ఫిరోజ్ ఖాన్

## హైదరాబాద్‌లో జలమండలి షాక్




- మంచినీటిని వృథా చేశారంటూ రూ.10 వేల జరిమానా
- తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించినందుకు చర్య
- బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 12లో ఘటన
- తాగునీటితో దుకాణ ప్రాంగణాన్ని కడిగిన వ్యక్తికి జరిమానా

**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో మంచినీటిని వృథా చేసినందుకు జలమండలి ఒక వ్యక్తికి రూ.10 వేల జరిమానా విధించింది. తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగించినందుకు గాను అధికారులు ఈ చర్య తీసుకున్నారు. బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్ 12లో ఆరెంజ్ ట్రీ ఫర్నీచర్ దుకాణం వద్ద ఈ ఘటన జరిగింది. తాగునీటితో ఒక వ్యక్తి - మిగతా 2 లో

# తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

- మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చించేందుకు సిద్ధమని సీఎం లేఖ
- తెలంగాణ ప్రతినిధులకు మహారాష్ట్ర సమయం ఇవ్వాలని కోరిన సీఎం



**హైదరాబాద్ :**

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ కోరారు. తుమ్మిడిహట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించాల్సిన అవసరం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు - మిగతా 2 లో

# సంపాదకీయం

## కాలుష్యంపై సమితి పోరు



వాతావరణ స్థితిగతులు మారి, పెను ముప్పు ముంచుకొస్తున్నా చాలా దేశాలు కళ్లు మూసుకున్నాయని గురువారం వాతావరణంపై జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తేటతెల్లం చేసింది. నిరుడు జూలైలో అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) వాతావరణంపై వెలువరించిన తీర్పును సమర్థిస్తూ చేసిన తీర్మానానికి 144 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. కానీ శిలాజ ఇంధనాలతో, తప్పుడు అభివృద్ధి నమూనాలతో కాలుష్యానికి కారణమవుతున్న అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు ఆ తీర్మానాన్ని వ్యతిరేకించాయి. మన దేశంతోపాటు 28 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. 2015 నాటి పారిస్ ఒడంబడిక వివిధ దేశాలు ఏమేరకు ఉద్గారాలు తగ్గించుకోవాలో నిర్దేశించినా అదంతా స్వచ్ఛందంగా అమలు చేసేది మాత్రమే. కానీ తాజా తీర్మానంతో ఆ అమలు చట్టపరమైన విధిగా మారింది. అయితే దాన్ని నిర్వర్తించమని ఒత్తిడి తెచ్చేవారెవరు?వాతావరణ మార్పులకు దారితీసే విధానాలను అవలంబించటం చట్టవిరుద్ధమనీ, అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఉద్గారాలను తగ్గించి, తన పౌరులకూ, ఇరుగు పొరుగు దేశాలకూ ముప్పు ఏర్పడకుండా చూడాల్సిన కనీస బాధ్యత ప్రతి దేశానికీ ఉంటుందనీ ఐసీజే తన తీర్పులో చెప్పింది. లాభార్జనపై మాత్రమే దృష్టి పెట్టే దేశాలవల్ల ప్రజల జీవించే హక్కు, ఆరోగ్యం, ఆహారం, ఇతరేతర జీవనప్రమాణాలు దెబ్బతింటున్నాయని గుర్తుచేసింది. దురదృష్టమేమంటే ఐసీజే తీర్పుల్ని పాటించితీరాలన్న నియమం లేదు. అవి కేవలం నైతికబాధ్యతను మాత్రమే గుర్తుచేస్తాయి.ఆయా దేశాల ప్రజలు తమ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి తప్ప ఇతరత్రా మార్గాల్లో చర్యలకు అవకాశం లేదు. ఐక్యరాజ్యసమితి తీర్మానాలకూ ఇదే వర్తిస్తుంది. ఏడాది కాలవ్యవధిలో పాకిస్తాన్, కాంగో, ఆస్ట్రియా, మధ్య యూరొప్ దేశాల్లో భారీ వరదలు సంభవించాయి. గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ ఈ స్థాయి వరదలు రాలేదని చెబుతున్నారు. అమెరికాలో కూడా మధ్య, దక్షిణ రాష్ట్రాలు రికార్డు స్థాయిలో టార్నెడోలు చవిచూశాయి. వేలాది ఇళ్లు నేలమట్టంకాగా, జనం బిక్కుబిక్కుమంటూ గడిపారు. పసిఫిక్ ద్వీపకల్ప దేశాలది తీరని వ్యథ. ముఖ్యంగా వనౌటు, తువాలు దేశాలకు ప్రకృతి వైపరీత్యాల సంగతలావుంచి అసలు తమ భూభాగమే కనుమరుగైపోతుందన్న భయం పట్టుకుంది. ఇప్పటికే అక్కడి భూగర్భ జలాలు ఉప్పగా మారి, తాగునీరు లభ్యత పడిపోయింది. వ్యవసాయం సాగక జనం వలసపోతున్నారు. ఇవన్నీ చాలవన్నట్టు ఇప్పుడు పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా బలపడుతున్న సూపర్ ఎల్‌నినో అన్ని దేశాలనూ వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయనీ, కరువుకాటకాలు, పెను వర్షాలు, వరదలు జనావాసాలను ముంచెత్తనున్నాయనీ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూగోళానికి ఉత్తర భాగంలో ఉండటంవల్ల నార్వే, ఫిన్లాండ్, స్వీడన్‌వంటి స్కాండినేవియన్ దేశాలకు వేడి బెడద పెద్దగా ఉండదు. వీటికి ప్రామాణికమైన విపత్తు నిర్వహణ వ్యవస్థలుండటంవల్ల వాతావరణ మార్పుల్ని తట్టుకోగలుగుతున్నాయి. స్విట్జర్లాండ్, డెన్మార్క్, సింగపూర్, న్యూజిలాండ్, ఆస్ట్రేలి యాలు సైతం వాటివాటి భౌగోళిక స్థానాలవల్లా, పకడ్బందీ చర్యలవల్లా సురక్షితమే. కానీ భూతాపోన్నతి పెరిగి, ప్రకృతి వైపరీత్యాలు చుట్టుముట్టి, మెజారిటీ దేశాలు సంక్షోభంలో పడి ఆహారగొలుసు దెబ్బతింటే అందరికీ ప్రమాదమే.అందుకే సమస్య అందరిదీ. అయితే సమితి తీర్మానం అన్ని దేశాల వాదనలనూ పరిగణనలోకి తీసుకోవాల్సింది. శతాబ్దాలుగా పారిశ్రామికీకరణతో వాతావరణాన్ని దెబ్బతీస్తూ, ఇప్పటికీ ఎలాంటి బాధ్యతకూ సిద్ధపడని అభివృద్ధి చెందిన దేశాలనూ... హరిత ఇంధన వ్యవస్థల కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న వర్ధమాన దేశాలనూ ఒకేగాటన కట్టడం, ఉద్గారాల తగ్గింపునకు అవసరమైన సాంకేతికతలను చవగ్గా అందించేందుకు సంసిద్ధంకాని దేశాలను పల్లెత్తు మాట అనకపోవడం తీర్మానం లోపం. అందుకే మన దేశమూ, మరికొన్ని దేశాలూ ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. మొత్తానికి పాశ్చాత్య దేశాల్లో సైతం వాతావరణ మార్పులపై గుబులు మొదలైందని తీర్మానంపై జరిగిన ఓటింగ్ నిరూపించింది. ఎలా చూసినా ఇది మంచి పరిణామం అని చెప్పాలి.

# మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేసేవారిపై క్రిమినల్ కేసులు

**మొదటిపేజీ తరువాయి -** ఏపీలో గతేడాది నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. నిరాధార ఆరోపణలతో సమాజంలో గందరగోళం సృష్టిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు, పరువు నష్టం నోటీసులు జారీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేసిన మీడియా, సోషల్ మీడియా, పలువురు వ్యక్తులు తక్షణమే విద్యాశాఖకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియ వంద శాతం పారదర్శకంగా జరిగిందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మవద్దని విద్యాశాఖ స్పష్టం చేసింది. "రాష్ట్రంలో మొత్తం 15,941 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నిబంధనలతో పాటు రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగానే జరిగింది. ముఖ్యంగా హారిజాంటల్ రిజర్వేషన్ అమలుపై కనీస అవగాహన లేకుండా కొందరు ఆరోపణలు చేస్తున్నారు. ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, మెరిట్ జాబితాలు ప్రచురించలేదని, అక్రమ ఎంపికలు జరిగాయని ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ప్రచారం చేస్తున్నారు" అని విద్యాశాఖ తన ప్రకటనలో పేర్కొంది.ప్రతి దశలోనూ పారదర్శకత, డిజిటల్ భద్రత, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని పటిష్ఠంగా అమలు చేశామని ప్రభుత్వం పేర్కొంది. మెరిట్, ఎంపిక జాబితాలతో పాటు అన్ని వివరాలను నోటిఫై చేసిన విధానం ప్రకారమే పారదర్శకంగా ప్రచురించామని, ఎంపిక ప్రక్రియ మొత్తం కేవలం మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా అత్యంత సురక్షితమైన డిజిటల్ విధానంలోనే నిర్వహించామని వివరించింది.ఈ అబద్ధపు ప్రచారాలు అభ్యర్థుల్లో అనవసర ఆందోళనలు రేకెత్తించడమే కాకుండా విద్యాశాఖ ప్రతిష్ఠకు, నియామక ప్రక్రియ విశ్వసనీయతకు భంగం కలిగిస్తున్నాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపింది. ప్రభుత్వం చేపట్టే అన్ని నియామక ప్రక్రియల్లో పారదర్శకత, నిష్పక్షపాతానికి కట్టుబడి ఉంటామని, అభ్యర్థులు ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తాం



**మొదటిపేజీ తరువాయి -** తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన తొలి మహానాడు ప్రసంగం సందర్భంగా నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మహానాడులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారీ ప్రకటన చేయబోతున్నట్టు ముందుగానే ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. చెప్పినట్టుగానే ఆయన భారీ ప్రకటన చేశారు. మహిళలు, యువతకు పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.నూతన హోదాలో తొలిసారి మహానాడు ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించిన లోకేశ్... మహిళా సాధికారతపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. "పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పాసైనా, అవ్వకపోయినా... రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ తరపున మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం" అని లోకేశ్ సంచలన ప్రకటన చేశారు. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, అందుకు కట్టుబడి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.నారా లోకేశ్ చేసిన ఈ భారీ అధికారిక ప్రకటనతో మహానాడు సభ ప్రాంగణంలో ఒక్కసారిగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అంతకుముందు నుంచే లోకేశ్ చేయబోయే ప్రకటనపై రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా రాబోయే కాలంలో సరికొత్త నాయకత్వాన్ని తయారుచేస్తామని లోకేశ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.

## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి



**మొదటిపేజీ తరువాయి -** వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు.అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు.చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# దేశ సరిహద్దులలో అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి



**మొదటిపేజీ తరువాయి -** సమావేశం నిర్వహించారు. దీనికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. ఈ సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల జనాభాకు మద్దతుగా నిలవడానికి, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.ప్రతి సరిహద్దు జిల్లాకు పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360-డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని అమిత్? షా చెప్పారు. ముఖ్యంగా అంతర్గత సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, అటువంటి నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్? షా ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి '1930' కాల్ సెంటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అంశాలపై రెండు నెలల తర్వాత తిరిగి సమీక్ష, అభిప్రాయ సేకరణ చేపడుతారని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలు ఫలిత ఆధారిత చర్యలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాటి ప్రభావం పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని ఒక ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ నేతృత్వంలో జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సిడిసి) ఏర్పాటు చేసింది. దిల్లీ కేంద్రంగా పనిచేసే ఈ కమిటీలో సెన్సస్ కమిషనర్‌తో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిలోగా తన నివేదికను సమర్పిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాయింట్ సెక్రటరీ (విదేశీయులు-1) ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని అమిత్? షా చెప్పారు.

## పినరయి విజయన్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత

**కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద హై టెన్షన్**

**ఈడీ సోదాలు ముగిశాక అధికారుల వాహనాలపై సీపీఎం కార్యకర్తల దాడి**

**దాడిలో మూడు వాహనాలు ధ్వంసం, పలువురికి గాయాలు**

**పోలీసుల తీరుపై విమర్శలు, పలువురు నిరసనకారుల అరెస్ట్**



**మొదటిపేజీ తరువాయి -** కేరళలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ అద్దెకు ఉంటున్న నివాసం వద్ద బుధవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు ముగించుకుని వెళుతున్న సమయంలో వారి వాహనాలపై సీపీఎం కార్యకర్తలు, సానుభూతిపరులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో మూడు వాహనాలు ధ్వంసం కాగా, పలువురికి గాయాలయ్యాయి.సీఎంఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఆర్థిక లావాదేవీల కేసుకు సంబంధించి ఈడీ అధికారులు విజయన్ నివాసంలో సోదాలు నిర్వహించారు. సోదాలు ముగిశాక అధికారులు తమ కాన్వాయ్‌లో బయలుదేరగా, అప్పటికే అక్కడ గుమిగూడిన సీపీఎం కార్యకర్తలు వారిని అడ్డగించారు. ఆగ్రహంతో కర్రలు, రాళ్లతో వాహనాలపై దాడి చేసి అద్దాలు పగలగొట్టారు.ఈ దాడిలో ఒక డ్రైవర్ కంటికి గాజు పెంకులు తగలడంతో తీవ్ర గాయమైంది. మరో డ్రైవర్‌తో పాటు, కొందరు కేంద్ర భద్రతా సిబ్బంది, పోలీసులు కూడా స్వల్పంగా గాయపడ్డారు. సీపీఎం సీనియర్ నాయకులు అక్కడే ఉన్నప్పటికీ ఈ దాడి జరగడం గమనార్హం.ఘటన జరిగినప్పుడు పోలీసులు మొదట ప్రేక్షకపాత్ర వహించారనే విమర్శలు వస్తున్నాయి. ఈడీ అధికారులు ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు రంగంలోకి దిగి దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయడం ప్రారంభించారు. అరెస్టు నుంచి తప్పించుకోవడానికి కొందరు కార్యకర్తలు సమీపంలోని పార్టీ కార్యాలయంలోకి పరుగులు తీయగా, పోలీసులు ఆ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఈ ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం.. పాలనలో దూకుడు చూపిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా 'జై చంద్రబాబు, జై తెలుగుదేశం' అంటూ అమరుడయ్యారు. ఆ స్ఫూర్తి కలకాలం నిలుస్తుంది" అని ఆయన నివాళు లర్పించారు. తనను అక్రమంగా జైల్లో పెట్టారని, లోకేశ్ యువగళం పాదయాత్రను అడ్డుకున్నారని, అయినా ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలబడిందని వివరించారు.టీడీపీ ఆవిర్భావం, సిద్ధాంతాలను చంద్రబాబు పునరుద్ఘాటించారు. "కూడు, గూడు, నీడ వంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించింది. జాతీయ జెండా దేశానికి గౌరవం అయితే, పసుపు జెండా తెలుగువారి ఆత్మగౌరవం" అని ఆయన అభివర్ణించారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై టీడీపీ నిరంతరం పోరాటం చేస్తోందని, ప్రజల్లో ఆదరణ చెక్కుచెదరలేదని తెలిపారు. బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నామని, ప్రజలు ఆ బాధ్యతను తమకు అప్పగించారని అన్నారు.మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. గతంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పిస్తే, నేడు 'తల్లికి వందనం' వంటి పథకాలతో వారి గౌరవాన్ని పెంచుతున్నామన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు టీడీపీ పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

**మొదటిపేజీ తరువాయి -** కావేరీ నదిపై కర్ణాటక ప్రభుత్వం మేకెదాటు ఆనకట్ట నిర్మించతలపెట్టింది. ఈ ప్రాజెక్టుతో తమకు వచ్చే కావేరీ నది నీరు తగ్గిపోతుందని తమిళనాడు చెబుతోంది. మేకెదాటు కోసం కర్ణాటక పంపే ప్రతిపాదనలు తిరస్కరించాలని మోదీని విజయ్ కోరారు. హస్తిన పర్యటనలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోనూ విజయ్ సమావేశమయ్యే అవకాశం ఉంది.

## తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని, ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

## గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల బాహాబాహీ

**మొదటిపేజీ తరువాయి -** కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం రసాభాసగా మారింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ముందే నేతలు ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ అల్ హాజ్రీ ఘర్షణపడ్డారు. ఉస్మాన్ నెట్టివేయడంతో ఫిరోజ్ ఖాన్ కిందపడ్డారు. ప్రోటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజారుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది.ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వి. హనుమంతరావు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆయనను కూడా నెట్టివేసేలా వారి తీరు ఉండటంతో మిగిలిన వారు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో అజారుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.కుర్చీ విషయంలో చిన్న మిస్ అండర్‌స్టాండింగ్ వల్ల గొడవ జరిగిందని ఫిరోజ్ ఖాన్ తెలిపారు. మంత్రి పక్కన కూర్చోవాలని అందరూ అనుకున్నారని పేర్కొన్నారు. ఉస్మాన్ తనకు పెద్దన్నలాంటివాడని పేర్కొన్నారు. ఇది తమ కుటుంబ విషయమని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో జలమండలి షాక్

**మొదటిపేజీ తరువాయి -** దుకాణ ప్రాంగణాన్ని కడిగాడు. తనిఖీల సందర్భంగా జలమండలి అధికారులు దీనిని గుర్తించారు.స్వయంగా రంగంలోకి దిగిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంచినీటిని వృథా చేస్తున్న వ్యక్తిని గుర్తించి అక్కడికక్కడే రూ.10 వేల జరిమానా విధించారు. ఈ క్రమంలో నగర ప్రజలకు జలమండలి అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.తాగునీటిని కేవలం తాగడానికి, గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు. రోడ్లు, ఇళ్ళు, వాహనాలు కడగడానికి ఉపయోగించకూడదని అన్నారు. నీటి వృథాను అరికట్టడంలో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని జలమండలి హెచ్చరించింది.

# బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

**మైనర్ బాలికను లైంగికంగా వేధించాడంటూ కేసు**

**చర్లపల్లి జైలు నుంచి భగీరథ్ ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు**

**కూకట్‌పల్లి డీసీపీ పర్యవేక్షణలో జరుగుతున్న విచారణ**



తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఈరోజు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరిపి, మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టును ఆశ్రయించగా... న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.ముందుగా నిందితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, భారీ భద్రత నడుమ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విచారణ ప్రక్రియ అంతా కూకట్‌పల్లి డీసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతోంది. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు మరిన్ని సెక్షన్లను చేర్చిన నేపథ్యంలో, ఈ మూడు రోజుల కస్టడీ విచారణ అత్యంత కీలకంగా మారనుంది.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

స్వచ్ఛ పథకం కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

వెల్దుర్తి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి

స్వర్ణగ్రామం కార్యాలయం, ఆధార్ శిబిరం, స్వచ్ఛ పథకం పనుల పరిశీలన





**వెల్దుర్తి, మే 27, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో నిర్వహిస్తున్న స్వర్ణగ్రామం కార్యాలయం, ఆధార్ నమోదు శిబిరం మరియు స్వచ్ఛ పథకం కార్యక్రమాలను ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, సేవలు, ఆధార్ నమోదు ప్రక్రియ, పారిశుధ్య కార్యక్రమాల అమలు తీరును ఆయన పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో పరిశుభ్రతను కాపాడుతూ స్వచ్ఛ పథకం కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో రవి కిషోర్ తెలిపారు.

# ఏఎస్ పేట ఎస్ఐ గా జీలాని బాధ్యతల స్వీకరణ




**నెల్లూరు, ఆత్మకూరు,ఏఎస్ పేట మే 27 (సీమ కిరణం న్యూస్) :** ఏఎస్ పేట మండల నూతన ఎస్ఐ గా షేక్. జీలాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సైదులు నెల్లూరు నార్త్ ట్రాఫిక్ కు బదిలీ కాగా ఆత్మకూరు ఎస్ఐ గా విధుల్లో ఉన్న జీలాని ఏఎస్ పేటకు బదిలీపై వచ్చారు. అంతకుముందు ఆయన స్థానికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. నూతన ఎస్ఐ కు సిబ్బంది ఘనంగా స్వాగతం పలుకుతూ శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా ఏఎస్ పేట ఎస్ఐగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన దర్గా ఉన్న ఇక్కడ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీస్ నిఘా పెట్టడం తో పాటు గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు.అలాగే గంజాయి నియంత్రణ ఆకతాయిలా ఆగడాలు కు అడ్డుకట్ట తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కర్ రెడ్డి సిబ్బంది ఉన్నారు......

# పేద ముస్లిం మహిళలకు బక్రీద్ తోఫా అందించిన డాక్టర్. శంకర్ శర్మ





**కల్లూరు, మే 27, (సీమకిరణం న్యూస్):** కర్నూలు గాయత్రీ ఎస్టేట్ లోఉన్న శ్రీ గురుదత్త పాలిక్లినిక్ లో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ నిరుపేద ముస్లిం మహిళలకు బక్రీద్ సందర్భంగా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ పండగలను అందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. భిన్నత్వంలో ఏకత్వంగా భారతదేశం ఉందని ఇక్కడ ఉన్నవారు కలిసి మెలిసి ఉండాలన్నారు. బక్రీద్ సందర్భంగా పేదలకు సహాయం చేయాలన్న ఉద్దేశ్యంతో నిత్యవసర సరుకులు అందించానని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయని వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. మంచి ఆహారం, తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలని కోరారు. తమకు నిత్యవసర సరుకులు ఇచ్చినందుకు మహిళలు డాక్టర్. శంకర్ శర్మ కు ధన్యవాదాలు తెలిపారు.

# వెల్దుర్తిలో ఘనంగా ప్రారంభమైన డిజిటల్ మహానాడు వేడుకలు





**వెల్దుర్తి, మే 27: (సీమ కిరణం న్యూస్ ) :** వెల్దుర్తి మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడు వేడుకలు వెల్దుర్తి మండల కేంద్రంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మిరెడ్డి పల్లె సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరై మహానాడు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ. శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో మహానాడు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వెల్దుర్తి మండల టీడీపీ అధ్యక్షుడు టి. బలరాం గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.ఈ. జ్ఞానేశ్వర్ గౌడ్, వెల్దుర్తి సింగిల్ విండో చైర్మన్ బొమ్మన రమాకాంత్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, పుల్లగుమ్మి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బజయ్య, బజారు తదితరులు పాల్గొన్నారు. మహానాడు సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు కార్యకర్తలకు వివరించారు. పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏఎస్ పేటలో ఘనంగా మహానాడు వేడుకలు



ఉత్సాహంగా పాల్గొన్న టిడిపి నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు

ఏ ఎస్ పేట మహానాడులో పాల్గొన్న మంత్రి 'ఆనం'





**నెల్లూరు, ఆత్మకూరు, ఏఎస్ పేట, మే (సీమ కిరణం న్యూస్) :** ఆత్మకూరు నియోజకవర్గం లోని ఏఎస్ పేట లో ఉన్న కామాక్షి కళ్యాణ మండపంలో జరుగుతున్న వర్చువల్ మహానాడు వేడుకలను మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలు మొత్తం టిడిపి జెండాలతో బ్యానర్లతో నింపి పసుపు మయంగా తీర్చిదిద్దారు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపుమేరకు ఏఎస్ పేటలో తొలి రోజు జరిగిన వర్చువల్ మహానాడు వేడుకలకు భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు తరలివచ్చారు ఈ మేరకు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కామాక్షి కళ్యాణ మండపంలో జరిగిన మహానాడు వేడుకలను పాల్గొని వీక్షించారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని టిడిపి పార్టీ నేతలు కార్యకర్తల తో కలసి ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా వీక్షించారు జై తెలుగుదేశం జై ఎన్టీఆర్ జై చంద్రబాబు జై ఆనమంటూ నినాదాలతో మహానాడు వేదిక వద్ద మార్మోగాయి అలాగే తొలత రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు మహానాడు వేడుకలకు విచ్చేసిన మండలంలోని పార్టీ శ్రేణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆనం రంగ మయూర్ రెడ్డి, ఆనం కైవల్యా రెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, కె రవీంద్రారెడ్డి, రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్ర్ఫక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, మండలంలోని టిడిపి నేతలు పులిమి సుధాకర్ రెడ్డి,కాటంరెడ్డి నరసింహారెడ్డి, ఏలూరి మాల్యాద్రి నాయుడు, దేవరాల హజరత్తయ్య, పైడి శ్రీనివాసులు, అల్లంపాటి మాధవరెడ్డి, నంది వివేకానందారెడ్డి, షేక్ జిలాని భాష ,షేక్ ఖాదర్ బాషా, తెలుగు యువత మండల అధ్యక్షులు సూరం నవీన్ కుమార్, ఎం బి టి బాబు, ఖాజామీయా, షేక్ షబ్బీర్, షేక్ అఫ్జల్, సురేష్, నాయుడు, నరసయ్య, రహమత్ నవాజ్, మండలంలోని క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని తొలిరోజు మహానాడు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు

# రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నాం









రెండేళ్లలో సాధించినద

విజయాలు ప్రజలకు వివరించాలి

కర్నూలులో మహానాడు

కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ గుప్తా

**కర్నూలు ప్రతినిధి, మే 27, (సీమకిరణం న్యూస్):** రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలు ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కర్నూలు నగరంలోని మౌర్య ఇన్‌లో జరిగిన మహానాడు కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ముందుగా దివంగత నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న మహానాడు కార్యక్రమాన్ని నాయకులతో కలిసి వీక్షించారు. కర్నూలు నగరంలో మొత్తం 12 ప్రాంతాల్లో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేయాల్సిన పనులపై మహానాడులో చర్చిస్తామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత క్యాడర్‌పై ఉందన్నారు. సంక్షోభం నేపథ్యంలో అన్ని జిల్లాల్లో, అన్ని ప్రాంతాల్లో వర్చువల్‌గా మహానాడు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకం ప్రజలకు తెలుసన్నారు. అయితే అప్పుడు, ఇప్పుడు అధికారులు ఒక్కరేనని.. నాయకుడు మాత్రమే మారాడన్నారు. విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు వలనే రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. దేశంలో వచ్చే పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు నివారించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఓర్వకల్లులో జైరాజ్ స్టీల్ కంపెనీకి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని.. అయితే గత ప్రభుత్వంలో అనుమతులు ఆలస్యం చేయడం వల్ల జైరాజ్ కంపెనీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. తమ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు మరో రూ.6వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు జైరాజ్ స్టీల్ కంపెనీ యాజమాన్యం ముందుకొచ్చిందన్నారు. ఇప్పటికే ఓర్వకల్లుకు అగస్త్య, రిలయన్స్ పెట్టుబడులు వచ్చాయన్నారు. సెమీ కండక్టర్ రంగంలో కేంద్ర ప్రభుత్వం 2.0 పాలసీ తీసుకొస్తే రూ.23వేల కోట్లు పెట్టుబడులు ఓర్వకల్లుకు వస్తాయన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్‌తో కలిసి కష్టపడి ఈ పెట్టుబడులు తీసుకొచ్చామని టీజీ భరత్ చెప్పారు. ప్రభుత్వం కంపెనీలతో చేసుకున్న ఎంఓయూలు గ్రౌండింగ్ అయ్యేలా తరచూ పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు వైసీపీ విష ప్రచారం చేస్తోందన్నారు. లేనిది ఉన్నట్లు సృష్టించడం వైసీపీ నైజం అన్నారు. ఆ పార్టీ అగ్ర నాయకత్వం ఎలా ఉంటే కింది స్థాయిలో కూడా నాయకులు అలాగే ఉంటారన్నారు. తమ తెలుగుదేశం పార్టీ పేరు చెబితేనే ఢిల్లీలో ఎంతో గౌరవం ఇస్తారన్నారు. టిడిపి లీడర్‌ని అని చెప్పుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాగే కొనసాగితే అభివృద్ధి జరుగుతూనే ఉంటుందన్నారు. ఇక కర్నూలులో వైసీపీ పరిస్థితి ఎలా ఉందో సొంత పార్టీ నేత మాట్లాడిన ఆడియో లీక్ ద్వారా బయటపడిందన్నారు. వైసీపీ కుట్ర రాజకీయాలు ప్రజలకు తెలియజేయాలని ఆయన క్యాడర్‌ను కోరారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని వార్డులు గెలిచేలా క్యాడర్ పనిచేయాలన్నారు. ప్రజల్లో మంచి పేరున్న నాయకుడికే కార్పొరేటర్‌గా టికెట్ ఇస్తామన్నారు. సర్వేలు చేసిన తర్వాతే అభ్యర్థి ఎన్నిక ఉంటుందన్నారు. ఇక నగరంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులు ఎన్నో జరుగుతున్నాయన్నారు. ఇటీవల గాలివానతో భారీ వర్షం కురిస్తే యుద్ధ ప్రాతిపదికన అధికారులను పరుగులు పెట్టించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. తానెప్పుడూ కర్నూలు ప్రజలకు మేలు చేయాలనే ఆలోచిస్తానన్నారు. సి.క్యాంపు ప్రభుత్వ క్వార్టర్స్‌లో హైకోర్టు బెంచ్ వస్తుందన్నారు. తద్వారా నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నగరంలోని వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమాలకు మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు.

# పేదల సంక్షేమమే చంద్రబాబు ఆశయం

టిడిపి సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ ఎల్ ఈ జ్ఞానేశ్వర్ గౌడ్

వెల్దుర్తిలో ఘనంగా మినీ మహానాడు వేడుకలు





**కర్నూలు ప్రతినిధి/ వెల్దుర్తి, మే 27, (సీమకిరణం న్యూస్):** పేదల సంక్షేమమే చంద్రబాబు ఆశయమని వెల్దుర్తి మండల టిడిపి సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ ఎల్ ఈ జ్ఞానేశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం వెల్దుర్తిలో మినీ మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ. శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో మినీ మహానాడు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తి నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగుదేశం కార్యకర్తల గుండెల్లో గూడుకట్టుకుందని అన్నారు. ఈనాటి లక్షలాది తెలుగు వారి ఉన్నతికి, సాంకేతిక ప్రగతికి చంద్రబాబు దార్శనికతే కారణమన్నారు. చంద్రబాబు దూరదృష్టితో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా పయనించిందని, నారా లోకేష్ ఆధునిక ఆలోచనలతో కొత్త తరానికి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన నాయకులకు కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎస్ పేట ఎస్ఐ గా జిలాని బాధ్యతల స్వీకరణ

నెల్లూరు, ఆత్మకూరు,ఏఎస్ పేట మే 27 (సీమ కిరణం న్యూస్) : ఏఎస్ పేట మండల నూతన ఎస్ఐ గా షేక్. జిలాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సైదులు నెల్లూరు నార్త్ ట్రాఫిక్ కు బదిలీ కాగా ఆత్మకూరు ఎస్ఐ గా విధుల్లో ఉన్న జిలాని ఏఎస్ పేటకు బదిలీపై వచ్చారు. అంతకుముందు ఆయన స్థానికంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. నూతన ఎస్ఐ కు సిబ్బంది ఘనంగా స్వాగతం పలుకుతూ శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా ఏఎస్ పేట ఎస్ఐగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన దర్గా ఉన్న ఇక్కడ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీస్ నిఘా పెట్టడం తో పాటు గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు.అలాగే గంజాయి నియంత్రణ ఆకతాయిలా ఆగడాలు కు అడ్డుకట్ట తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కర్ రెడ్డి సిబ్బంది ఉన్నారు......





సీమకిరణం
కర్నూలు నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



## ట్రైన్ ఇంజిన్ ధర తెలిస్తే షాక్ అవుతారు.! పూర్తిస్థాయి రైలు తయారు చేయడానికి ఇన్ని కోట్లా.?



భారతీయ రైల్వేలో పట్టాలపై పరుగులు తీసే ఎలక్ట్రిక్ ఇంజిన్ల శక్తి అపారం. సాధారణంగా ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్ తయారీకి 25 నుండి 30 కోట్ల రూపాయల ఖర్చవుతుంది. ఇవి వేల టన్నుల బరువును సునాయాసంగా లాగగలవు. టెక్నాలజీ పెరిగేకొద్దీ వీటి ధర కూడా పెరుగుతోంది. ఆ వివరాలు ఇలా.. మన దేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణించే భారతీయ రైల్వేల గురించి మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా ఒక రైలు ఇంజిన్ ధర ఎంత ఉంటుంది? లేదా మనం కూర్చునే ఒక్కో కోచ్ తయారు చేయడానికి ఎంత ఖర్చవుతుంది? అనే ప్రశ్నలు చాలా మందికి తలెత్తుతుంటాయి. ఈ ధరలు వింటే మీరు ఖచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఒక రైలు ఇంజిన్ కొనే డబ్బుతో ఒక చిన్న ఊరినే దత్తత తీసుకోవచ్చు అంటే నమ్ముతారా? అవును, రైల్వే పరికరాల తయారీకి భారీగా ఖర్చవుతుంది. సాధారణంగా ఒక రైలు ఇంజిన్(లోకోమోటివ్) ధర అనేది దాని సామర్థ్యం, టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మనం వాడుతున్న ఎలక్ట్రిక్ లోకోమోటివ్ ధర సుమారు 25 నుండి 30 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. భారతీయ రైల్వేలోనే అత్యంత శక్తివంతమైన లోకోమోటివ్ అయిన 12దీ' ధర దాదాపు 35 కోట్ల రూపాయలు. ఇక డీజిల్ ఇంజిన్ల విషయానికి వస్తే, వీటి ధర 15 నుండి 20 కోట్లు ఉంటుంది, అయితే పర్యావరణ కారణాల వల్ల ప్రస్తుతం వీటి తయారీని రైల్వే శాఖ తగ్గించింది. ఇక మనం ప్రయాణించే కోచ్‌ల విషయానికి వస్తే, ఎల్హెచ్‌బి(ౡఎదీ) జనరల్ క్లాస్ కోచ్ ధర 1.5 నుండి 2 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. అదే స్లీపర్ క్లాస్ కోచ్ అయితే 2 నుండి 2.5 కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. ఏసీ కోచ్‌ల ధరలు ఇంకా ఎక్కువగా ఉంటాయి; థర్డ్ ఏసీ కోచ్‌కు 2.8 నుండి 3 కోట్లు, సెకండ్ ఏసీ లేదా ఫస్ట్ ఏసీ కోచ్ తయారీకి 3.2 నుండి 3.5 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. అంటే మనం ప్రయాణించే ఒక్క ఏసీ కోచ్ విలువ కొన్ని ఖరీదైన విల్లాల కంటే ఎక్కువే! ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న 16 కోచ్‌ల 'వందే భారత్' రైలు తయారీ ఖర్చు సుమారు 115 కోట్ల రూపాయలు. దీన్ని బట్టి చూస్తే, ఒక పూర్తి స్థాయి ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాల మీదకు రావాలంటే సగటున 85 నుండి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇంత భారీ వ్యయంతో తయారైన ఈ రైల్వే ఆస్తులను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

## ఇక్కడి ఇసుకను తెల్ల బంగారంగా పిలుస్తారు ఎందుకో తెలిస్తే అవునా.. నిజమా.? అంటూ నోరెళ్ల బెట్టాల్సిందే!




భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కేవలం వ్యవసాయానికే కాదు, అద్భుతమైన ఖనిజ సంపదకు కూడా నిలయం. ఇక్కడి నేలల్లో లభించే సిలికా శాండ్ ను స్థానికులు తెల్ల బంగారం అని పిలుస్తారు. దీనికి కారణం ఈ ఇసుక ద్వారానే కోట్లాది రూపాయల విలువైన గాజు పరిశ్రమ నడుస్తోంది. ముఖ్యంగా యూపీలోని ఫిరోజాబాద్ నగరం గ్లాస్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచింది. ఫిరోజాబాద్ గాజు పరిశ్రమ, ఇక్కడి తెల్ల బంగారానికి సంబంధించిన ఆసక్తికరమైన అంశాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ భూగర్భంలో దాగి ఉన్న సిలికా శాండ్‌ను అక్కడి ప్రజలు తెల్ల బంగారం (ఔష్ట్రఉవ +శీశ్రీఏ) అని పిలుస్తారు. ముఖ్యంగా ఫిరోజాబాద్ నగరం భారతదేశపు గాజు రాజధానిగా (+శ్రీఝం ఝుజూఊఝుశ్రీ) ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఫిరోజాబాద్‌లో గాజు తయారీ సంప్రదాయం శతాబ్దాల నాటిది. మొఘల్ కాలంలో, ముఖ్యంగా అక్బర్ చక్రవర్తి పాలనలో పర్షియా, మధ్య ఆసియా నుండి నిపుణులైన గాజు కళాకారులను ఇక్కడికి రప్పించారు. వారు స్థానిక మట్టిలోని ప్రత్యేకతను గుర్తించి గాజు వస్తువుల తయారీకి పునాది వేశారు. పురావస్తు ఆధారాల ప్రకారం, బస్తీ జిల్లాలోని కోపియాలో జరిపిన త్రవ్వకాల్లో క్రీస్తుపూర్వం 3వ శతాబ్దానికి చెందిన గాజు అవశేషాలు లభించడం గమనార్హం. యూపీలోని ప్రయాగ్‌రాజ్ (శంకర్గఢ్), మీర్జాపూర్, సోన్‌భద్ర, చిత్రకూట్, బాండా వంటి జిల్లాల్లో అత్యున్నత నాణ్యత కలిగిన సిలికా ఇసుక లభిస్తుంది. శంకర్గఢ్ నుండి సేకరించిన ఇసుక దేశవ్యాప్తంగా ఉన్న గాజు కర్మాగారాలకు సరఫరా చేయబడుతుంది. ఇందులో ఐరన్ ఆక్సైడ్ తక్కువగా ఉండటం వల్ల ఇది గాజు తయారీకి అత్యంత అనువైనదిగా పరిగణించబడుతుంది. ఈ సిలికా ఇసుకను ఉపయోగించి కేవలం అలంకరణ వస్తువులే కాకుండా, ఆధునిక కాలంలో అత్యంత అవసరమైన సోలార్ ప్యానెల్ గ్లాస్, కిటికీ అద్దాలు, ఔషధాల సీసాలను తయారు చేస్తున్నారు. దాదాపు 200 ఏళ్లుగా ఫిరోజాబాద్ గాజు గాజులతయారీలో ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే రంగురంగుల గాజులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. యూపీ నేలల్లో ఉన్న ఈ సహజ సంపద లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోంది. నాణ్యమైన ముడిసరుకు, తరతరాలుగా వస్తున్న కళాకారుల నైపుణ్యం కలగలిసి ఉత్తరప్రదేశ్‌ను గాజు పరిశ్రమలో ప్రపంచ పటంలో నిలబెట్టాయి. ఒక సామాన్యమైన ఇసుక రేణువును అద్భుతమైన గాజు శిల్పంగా మార్చే ఈ ప్రయాణం నిజంగా ఆశ్చర్యకరం.

## రూపాయి విలువ పడిపోతున్నా టెన్షన్ అక్కర్లేదు! RBI మాజీ గవర్నర్ కీలక వ్యాఖ్యలు




భారత రూపాయి విలువ క్షీణత ఆందోళన కలిగించినా, అతిగా భయపడాల్సిన అవసరం లేదని మాజీ ఆర్‌బీఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. బలహీన రూపాయి ఎగుమతులకు ఊతమిస్తుందని, 2013తో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు బలంగా ఉందని ఆయన వివరించారు. అవసరమైనప్పుడు మాత్రమే ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలని సూచించారు. భారతీయ రూపాయి విలువ ఇటీవల అమెరికా డాలర్‌తో పోలిస్తే భారీగా క్షీణించిన నేపథ్యంలో భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి బలహీనపడటం ఆందోళన కలిగించే అంశమే అయినప్పటికీ, దానిపై అతిగా భయపడాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 95.80 వరకు పడిపోయి, చివరకు 95.71 వద్ద ముగియడం మార్కెట్లలో చర్చనీయాంశమైంది. అయితే కరెన్సీ మార్పిడిలో కొంత స్థాయి ఒత్తిడి సహజమని, మార్కెట్ పరిస్థితుల ప్రకారం రూపాయి తన నిజమైన విలువను కనుగొనే అవకాశం ఇవ్వాలని సుబ్బారావు సూచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం బలహీనమైన రూపాయి ప్రతికూలతలతో పాటు కొన్ని ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. ముఖ్యంగా, దిగుమతి అయ్యే ముడి చమురు ఖర్చు పెరగడం వల్ల దేశంలో చమురు వినియోగం కొంత తగ్గవచ్చు. అదే సమయంలో భారతీయ ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. రూపాయి విలువ తగ్గడంతో విదేశీ కొనుగోలుదారులకు భారత ఉత్పత్తులు తక్కువ ధరలకు లభిస్తాయి కాబట్టి, ఎగుమతులకు ఊతం లభించవచ్చని ఆయన వివరించారు. 2013లో జరిగిన ఆర్థిక సంక్షోభంతో ప్రస్తుత పరిస్థితిని పోల్చిన సుబ్బారావు, ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ గతంతో పోలిస్తే మరింత బలంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా విదేశీ మారక నిల్వలు, ద్రవ్యలోటు నియంత్రణ, బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరత్వం వంటి అంశాల్లో భారత్ మంచి స్థితిలో ఉందన్నారు. 2013 టేపర్ టాంట్రమ్ సమయంలో విదేశీ పెట్టుబడుల భారీ ఉపసంహరణ కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. అయితే ఇప్పుడు పరిస్థితులు అంతగా ప్రమాదకరంగా లేవని ఆయన భావిస్తున్నారు. అయితే ప్రపంచ ఆర్థిక పరిస్థితి మాత్రం ఇంకా అనిశ్చితంగానే ఉందని హెచ్చరించారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, అమెరికా వడ్డీ రేట్ల విధానం, గ్లోబల్ మార్కెట్లలో అస్థిరత వంటి అంశాలు రూపాయిపై ఒత్తిడిని కొనసాగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రూపాయిని కృత్రిమంగా ఒక స్థాయిలో నిలబెట్టేందుకు భారీగా జోక్యం చేసుకోవడం కంటే, అవసరమైనప్పుడు మాత్రమే ఆర్‌బిఐ జోక్యం చేసుకోవడం మంచిదని సుబ్బారావు సూచించారు. దీర్ఘకాలంలో మార్కెట్ ఆధారిత మారకపు విలువ వ్యవస్థే ఆర్థిక వ్యవస్థకు ఆరోగ్యకరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఈవీ కొనుగోలుదారులకు సర్కార్ గుడ్ న్యూస్ రూ. లక్ష సబ్సిడీ 50% టాక్స్ తగ్గింపు..!



దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (జుంఎ) వినియోగాన్ని పెంచేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా సర్కార్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (జుంఎ) వినియోగాన్ని పెంచేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. తాజాగా బీహార్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'బీహార్ ఎలక్ట్రిక్ వాహనాల (సవరణ) విధానం 2026' కు ఆమోదం లభించింది. ఈ కొత్త ఈవీ విధానం ప్రకారం, రాష్ట్రంలో ఎలక్ట్రిక్ కార్లను (ఫోర్ వీలర్స్) కొనుగోలు చేసే మహిళలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మహిళలు ఈవీ కార్లను కొనుగోలు చేస్తే ఏకంగా రూ. 1 లక్ష వరకు నేరుగా సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించనుంది. ఇది మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి, పర్యావరణహిత ప్రయాణాన్ని ఎంచుకోవడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ కొత్త విధానం కేవలం కార్లకే పరిమితం కాకుండా, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలుదారులకు కూడా భారీ ఉపశమనాన్ని కలిగిస్తోంది. వాహనాల కేటగిరీని బట్టి సబ్సిడీ విధానం మారుతుంది. సాధారణ వర్గానికి చెందిన వ్యక్తులు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడానికి 10,000 రూపాయల వరకు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులు 12,000 రూపాయల వరకు సబ్సిడీని పొందుతారు. ఎలక్ట్రిక్ కార్గో త్రిచక్ర వాహనాల కోసం, సాధారణ వర్గానికి 50,000 రూపాయల వరకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 60,000 రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుంది. దీంతో పాటు, బీహార్‌లో ఈవీ వాహనాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రతి ఒక్కరికీ మోటారు వాహన పన్నులో (వీశీశీ ఎవష్త్రఉఎశ్రీవ ఝఇ) ఏకంగా 50 శాతం వరకు రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ స్క్రాపేజ్ విధానానికి అనుగుణంగా, పాత పెట్రోల్, డీజిల్ వాహనాలను స్క్రాప్ చేసి కొత్త ఈవీలను కొనే వారికి అదనపు ప్రయోజనాలు కూడా అందుతాయి. రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా బీహార్ ప్రభుత్వం పని చేస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో నమోదయ్యే మొత్తం కొత్త వాహనాలలో కనీసం 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉండాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం గనుక నెరవేరితే, రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 100 మిలియన్ లీటర్ల పెట్రోల్, డీజిల్ ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది సామాన్యుడి జేబుకు రవాణా ఖర్చులను తగ్గించడమే కాకుండా, పర్యావరణాన్ని ఎంతగానో కాపాడుతుంది. ఎలక్ట్రిక్ వాహనదారులకు ఛార్జింగ్ ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారీగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. నగరాల్లోని షాపింగ్ మాల్స్, హోటళ్లు, పెట్రోల్ పంపులు, పెద్ద నివాస సముదాయాలలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసే నిర్వాహకులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను కూడా అందించనున్నారు. బీహార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రవాణా రంగాన్ని సరికొత్త హరిత మార్గం వైపు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## డబ్బే డబ్బును సంపాదించే దిమ్మతిరిగే ఐడియా.. ఇప్పుడే ప్రారంభించండి.! సీక్రెట్ టిప్స్..



మన జీవితంలో డబ్బు కంటే సమయమే అత్యంత విలువైనది. చాలా మంది గంటల కొద్దీ చిన్న చిన్న బేరసారాల కోసం సమయాన్ని వృథా చేస్తుంటారు. కానీ అదే సమయాన్ని తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి కేటాయిస్తే ఆదాయం కొన్ని రెట్లు పెరుగుతుంది. అంబానీకైనా, వారెన్ బఫెట్‌కైనా మనకైనా రోజుకు ఉండేది 24 గంటలే.. డబ్బు సంపాదించడం ఎలా? ఈ ప్రశ్న మనలో చాలామందికి నిత్యం మెదలుతూనే ఉంటుంది. కానీ, ఆదాయాన్ని కేవలం సంపాదించడం మాత్రమే కాదు, దాన్ని సరిగ్గా వృద్ధి చేసుకోవడం కూడా ఒక గొప్ప కళేనని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆర్థిక నిపుణులు ఒకరు సంపాదన, సంపదకు సంబంధించిన కొన్ని అత్యంత ఆసక్తికరమైన, ప్రాక్టికల్ విషయాలను పంచుకున్నారు. మన జీవితంలో ఆర్థిక ప్రణాళిక అనేది కేవలం పొదుపుకే పరిమితం కాకుండా, సమయాన్ని, డబ్బును మనం ఏ విధంగా మేనేజ్ చేస్తామనే దానిపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని కోరుకుంటారు, కానీ దానికి సరైన మార్గం ఏంటో చాలా మందికి తెలియదు. ఇక్కడ మనిషి ఆలోచనా దృక్పథం అనేది చాలా కీలకంగా మారుతుంది. ముందుగా సమయానికి, డబ్బుకు మధ్య ఉన్న లోతైన తేడాను గుర్తించడం చాలా అవసరం. సాధారణంగా మనం సమయమే అన్నింటికంటే విలువైనది అని మాటల్లో చెప్తాం కానీ, మన నిత్య జీవితంలో మాత్రం డబ్బుకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ ఉంటాం. డబ్బు మళ్లీ సంపాదించుకోవచ్చు కానీ గడిచిన సమయం ఎప్పటికీ తిరిగి రాదు. ఈ చిన్న లాజిక్ మన బ్రెయిన్‌కు అర్థమైతే సంపాదన మార్గాలు ఆటోమేటిక్‌గా మెరుగుపడతాయి. అనవసరమైన బేరసారాలు చేస్తూ గంటల కొద్దీ మన విలువైన సమయాన్ని వృథా చేసే బదులు, అదే సమయాన్ని కొత్త విషయాలు నేర్చుకోవడానికి లేదా మనం చేసే వృత్తిలో మరింతగా రాణించడానికి ఉపయోగిస్తే మన ఆదాయం ఖచ్చితంగా పెరుగుతుంది. మన ప్రతి నిమిషం ఒక ఇన్వెస్ట్‌మెంట్ లాంటిది. డబ్బును వృద్ధి చేసుకోవాలంటే కేవలం ఏదో ఒక చోట పెట్టుబడులు పెడితే సరిపోదు, దానికంటూ ఒక క్రమశిక్షణ కలిగిన పద్ధతి ఉండాలి. లోకంలో 'రిచ్ పీపుల్ పూర్ పీపుల్' ఉండరు, కేవలం 'రిచ్ థింకింగ్ పూర్ థింకింగ్' మాత్రమే ఉంటుంది. మన ఆదాయంలో కొంత భాగాన్ని మొదట సెక్యూరిటీ కోసం అంటే ఇన్సూరెన్స్ వంటి వాటి కోసం కేటాయించాలి. ఏదైనా అనారోగ్యం పాలైనప్పుడు మన కష్టార్జితం మొత్తం ఆసుపత్రి పాలవ్వకుండా ఉండాలంటే ఇన్సూరెన్స్ చాలా ముఖ్యం. ఆ తర్వాత అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలి. ఇది మనకు ఉద్యోగం పోయినా లేదా అనుకోని కష్టాలు ఎదురైనా అండగా నిలుస్తుంది. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు మనల్ని పెద్ద ఆర్థిక సంక్షోభాల నుండి రక్షిస్తాయి. చివరగా, మన ప్రతి రూపాయిని ట్రాక్ చేయడం అలవాటు చేసుకోవాలి. మనకు వచ్చే ఆదాయం ఎంత? మనం చేసే ఖర్చులు ఏమిటి? ఆస్తులు, అప్పుల మధ్య సమతుల్యత ఎలా ఉంది? అనే విషయాలను ఒక ఎక్సెల్ షీట్‌లో లేదా బుక్‌లో రాసుకోవాలి. దీన్నే 'రియల్ స్టేట్మెంట్' అంటారు. కేవలం విలాసాల కోసం ఎంత ఖర్చు పెడుతున్నామో తెలిస్తేనే, అనవసర ఖర్చులను అరికట్టగలం. సంపద సృష్టించడం అనేది ఒక్క రోజులో లేదా ఒక్క రాత్రిలో జరిగేది కాదు. దీనికి ఓపిక, పట్టుదల, నిరంతర పర్యవేక్షణ ఎంతైనా అవసరం. మనం సంపాదన పట్ల ఎంత శ్రద్ధ చూపిస్తామో, మన సమయం పట్ల కూడా అంతే గౌరవం చూపినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుకోగలం. ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తే వచ్చే ఐదేళ్లలో మన ఆర్థిక స్థితిగతుల్లో స్పష్టమైన మార్పును గమనించవచ్చు. తెలివిగా ఆలోచించండి, మీ సమయాన్ని గౌరవించండి, అద్భుతమైన సంపదను సృష్టించండి. మన ఆలోచనా విధానమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది కాబట్టి ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండండి. మీ విజయానికి మీరే బాధ్యులు అన్న విషయాన్ని మర్చిపోకండి. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి, కాలంపై అవగాహన మీ జీవితాన్ని సంపన్నం చేస్తాయి. మీ జీవితంలో ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి.

## కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. చక్కెర ఎగుమతులపై నిషేధం! ఎందుకంటే?




భారత ప్రభుత్వం చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేసింది, ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలను స్థిరీకరించడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే దీని వెనుక ప్రధాన ఉద్దేశ్యం. దేశీయ ఉత్పత్తి తగ్గుదల, వాతావరణ అనిశ్చితి ఈ నిర్ణయానికి దారితీశాయి. భారత ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం ముడి, శుద్ధి చేసిన చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు అమల్లో ఉండనుంది. దేశీయ మార్కెట్లో చక్కెర ధరలు అదుపు తప్పకుండా చూడడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశ్యమని తెలుస్తోంది. అయితే ఇప్పటికే రవాణా ప్రక్రియలో ఉన్న కొన్ని సరుకులకు మినహాయింపులు ఇవ్వనున్నట్లు సమాచారం. నిషేధానికి ముందు లోడింగ్ ప్రారంభమైన సరుకులు, భారత ఓడరేవుల వద్ద ఇప్పటికే లంగరు వేసిన నౌకలు, లేదా కస్టమ్స్‌కు ముందుగానే అప్పగించిన నిల్వలకు ఎగుమతి అనుమతి కొనసాగనుంది. దీంతో విదేశీ కొనుగోలుదారులతో ఇప్పటికే కుదిరిన ఒప్పందాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం విధానపరంగా పెద్ద మార్పుగా భావిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో దేశీయ ఉత్పత్తి అవసరాలకు మించి ఉంటుందని అంచనా వేసిన కేంద్రం, 1.59 మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతికి అనుమతి ఇచ్చింది. కానీ ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో చెరకు దిగుబడులు తగ్గడం, వాతావరణ అనిశ్చితి పెరగడం పరిస్థితిని మార్చేశాయి. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, వరుసగా రెండో ఏడాది కూడా భారత్ వినియోగించే మొత్తానికి తక్కువ చక్కెరనే ఉత్పత్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాతావరణ నిపుణులు అభివృద్ధి చెందుతున్న ఎల్‌నినో ప్రభావంపై కూడా హెచ్చరిస్తున్నారు. పశ్చిమ, దక్షిణ భారతదేశాల్లో చెరకు సాగుకు కీలకమైన నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో, భవిష్యత్ ఉత్పత్తిపై మరింత అనిశ్చితి నెలకొంది. బలహీనమైన వర్షాలు వస్తే సరఫరా ఒత్తిడి మరింత పెరిగే ప్రమాదం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆమోదించిన ఎగుమతి కోటాలో దాదాపు 8 లక్షల టన్నుల సరుకులకు ఒప్పందాలు కుదిరాయి. అందులో 6 లక్షల టన్నులకు పైగా సరుకు విదేశాలకు తరలిపోయినట్లు సమాచారం. ఇప్పుడు మిగిలిన సరఫరాలను ఎలా నిర్వహించాలన్న దానిపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారుగా ఉండటంతో, ఈ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్లపై కూడా ప్రభావం చూపుతోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలు ఇప్పుడు సరఫరాల కోసం బ్రెజిల్, థాయిలాండ్‌ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రకటన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో ముడి చక్కెర, తెల్ల చక్కెర ఫ్యూచర్స్ ధరలు పెరిగాయి. ప్రస్తుతం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, గ్లోబల్ సరఫరా గొలుసు అంతరాయాల మధ్య భారత్ తీసుకుంటున్న ఈ రక్షించే ప్రయత్నంగానే కనిపిస్తున్నాయి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com